క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మునగపాకలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో ఎరకయ్య, ఈసీ సంధ్యారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఐ ధనుంజయరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: యలమంచిలి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సిరిపురపు ధనుంజయరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐల సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి రూరల్ సీఐగా పని చేస్తున్న ధనుంజయరావును యలమంచిలి సర్కిల్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయనకు యలమంచిలి పట్టణ ఎస్ఐ కె.సావిత్రి, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మునగపాక ఎస్ఐ అభినందనలు

మునగపాక: యలమంచిలి సీఐ ధనుంజయరావును శుక్రవారం మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్క అందజేసి అభినందనలు తెలిపారు.

'దందా చేస్తున్నట్టు దుష్ప్రచారం తగదు'

మునగపాక(అచ్యుతాపురం): పరిశ్రమలు, లారీ యజమానుల వద్ద తాను దందా చేస్తున్నట్టు కొంత మంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది తగదని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం అచ్యుతాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించామన్నారు. వచ్చేనెల 2న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే


అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: పీఎస్ఆర్‌పేట దుర్గాదేవి ఆలయంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గౌరీ శంకరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ముందుగా అభిషేకం, అష్టోత్తర, కుంకుమ పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నక్కపల్లి: గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నేత్ర వైద్య పరీక్షలు చేశారు. కంటి వెలుగు పథకం కింద నక్కపల్లి ఆప్తాలమిక్ అసిస్టెంట్ దృష్టి లోపాలతో బాధపడే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 583 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేయగా.. 15 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఇదే పాఠశాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులకు కూడా నేత్ర పరీక్షలు చేశారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

నక్కపల్లి: సెప్టెంబరు నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియను శనివారం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పింఛన్ల సొమ్మును ఇప్పటికే బ్యాంకుల్లో జమ చేశామన్నారు. శనివారం ఉదయం చే పంపిణీ ప్రారంభంకావాలన్నారు. సాయంత్రానికి పూర్తి చేయాలని, మిగిలిపోతే వచ్చే నెల 2న బట్వాడా చేయాలని ఎంపీడీవో సూచించారు.

రైతులపై స్మార్ట్ మీటర్ల పిడుగు

- నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన టీడీపీ
- నేడు అధికారంలోకి రాగానే మీటర్ల ఏర్పాటుకు సుముఖతపై సర్వత్రా విమర్శలు
- గుట్టుచప్పుడు కాకుండా మీటర్ల ఏర్పాటు
- అడ్డుకుంటున్న రైతులు


స్మార్ట్‌మీటర్ల బిగింపు వద్దంటూ ఆందోళన చేస్తున్న రైతులు


మునగపాక తంపర మూల ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్

మునగపాక: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్ వ్యవస్థను వ్యతిరేకించిన టీడీపీ.. నేడు అధికారంలోకి రాగానే మీటర్ల ఏర్పాటు చర్యలను ముమ్మరం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఉచిత విద్యుత్‌కు మంగళం పాడుతారంటూ తప్పుడు ప్రచారం చేసిన టీడీపీ.. నేడు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానానికి వంతపాడడం ఎంత వరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చడంపై మండిపడుతున్నారు. వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విధానంతో రైతులకు అందే ఉచిత విద్యుత్‌కు మంగళం పాడతారన్న అనుమానం అందరిలో కలుగుతోంది. మీటర్ల ఏర్పాటు ప్రక్రియను రైతులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. భవిష్యత్‌లో పంపుసెట్లకు బిల్లులు వసూలు చేస్తారేమోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. గ్రామాల్లోని పొలాల్లో విద్యుత్ శాఖ అధికారులు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న వామపక్షాల నేతలు రైతులతో కలిసి అడ్డుకున్నారు. మునగపాక, చూచుకొండ తదితర ప్రాంతాల్లో మీటర్ల ఏర్పాటును రైతులు అడ్డుకోవడంతో అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

తెల్లవారుజామున మీటర్ల బిగింపుపై విస్మయం

అధికారులు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు సంబంధించి రైతుల నుంచి ప్రతిఘటన రావడంతో తెల్లవారుజామున 5 గంటలకే పొలాలకు వెళ్లి విద్యుత్ సిబ్బంది స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇష్టం లేకుండా మీటర్ల ఏర్పాటు తగదంటూ మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 మండలాలకు సంబంధించి 30 వేలకు పైగా పంపు సెట్లు ఉన్నాయి. ఇప్పటికే 16 వేలకు పైగా స్మార్ట్ మీటర్లు బిగించేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించడం.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ మీటర్ల ఏర్పాటును సమర్థించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ హయాంలో మీటర్ల ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోతుందని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది.

మీటర్ల ఏర్పాటు ప్రక్రియను నిలిపేయాలి



పొలాల్లోని విద్యుత్ స్తంభాలకు స్మార్ట్ మీటర్లు బిగించి వెళ్లిపోతున్నారు. మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేయాలి. ఎన్నికల తరువాత మీటర్ల బిగింపు ఉండదనుకున్నాం. ప్రస్తుతం బిల్లులు వసూలు చేయకపోయినా.. తర్వాతైనా వసూలు చేస్తారేమోనన్న భయం వెంటాడుతోంది.

– దొడ్డి గణేష్, రైతు, మునగపాక

విద్యుత్ సబ్సిడీ ఎత్తివేసే కుట్ర



రైతులకు సబ్సిడీపై ఇచ్చే విద్యుత్‌ను ఎత్తివేసే కుట్రలో భాగమే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యుత్ చట్టం ప్రకారం సబ్సిడీలు ఉండవు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు పనులు తక్షణమే నిలిపివేయాలి.

– వీవీ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి

పనులు ఆపేశాం..

రైతుల కమతాల్లో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు పనులను ప్రస్తుతం ఆపేశాం. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీసుకువచ్చింది. రైతులు ఆందోళన చెందనక్కరలేదు.

– గోపీకృష్ణ, విద్యుత్ శాఖ ఏఈ

నేవీ ప్రహరీ నిర్మాణంపై జోరువానలో ఆందోళన


పెదకలవలాపల్లిలో జోరు వర్షంలో ఆందోళన చేస్తున్న నేవీ ప్రహరీ నిర్వాసితులు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం పెద కలవలాపల్లిలో నేవీ అధికారులు అటవీ శాఖ ఆ. దీనంలో ఉన్న కొండ చుట్టూ తలపెట్టిన ప్రహరీ నిర్మాణ పనులు ఆపాలంటూ శుక్రవారం గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున జోరువానలో ఆందోళన చేశారు. గ్రామంలో 313 రోజులుగా నేవీ ప్రహరీ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షణ గోడ పనులు ఆపి గ్రామంలో ప్రజలకు ఉపాధి కల్పించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు ఆందోళనను విరమించేది లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావి దేముళ్లు, కలవలపల్లి రాము, అప్పికొండ అప్పారావు, బోదపు పెదబుల్లి, పారిపల్లి కాంత, జాగారపు అప్పలనర్స, మారిశెట్టి నాగరత్నం, యలమంచిలి చిన సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక(అచ్యుతాపురం): ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత తగదని జిల్లా రీసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు అన్నారు. శుక్రవారం అచ్యుతాపురం మండలం మల్లవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆదేశాల మేరకు ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' అనే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుర్తించాలన్నారు. సీహెచ్‌వో వెంకటలక్ష్మి, ఏఎన్ఎం మరియమ్మ, మహిళా పోలీసు గీతాంజలి, లింక్ వర్కర్ సరస్వతి, వైద్య సిబ్బంది, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

మునగపాక: వాడ్రాపల్లిలో నిర్వహించిన పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ వార్షికోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ముగిశాయి. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పలు ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రముఖ వైద్యులు పెతకంశెట్టి సతీష్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్థానికంగా అందుబాటులో ఉన్న గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ గౌరవాధ్యక్షుడు రామజోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల వరహా నరసింగరావు, మళ్ల రాజేష్ పాల్గొన్నారు.

గౌరవ వేతనం కోసం బీఎల్‌వోల వినతి


బకాయి గౌరవ వేతనాలు చెల్లించాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఎల్వోలు

యలమంచిలి రూరల్: మూడున్నరేళ్ల నుంచి తమకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని యలమంచిలి మండలంలో పనిచేస్తున్న బీఎల్‌వోలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం యలమంచిలి ఏఈఆర్‌వో కార్యాలయంలో తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు మురళీబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్ల నుంచి తాము బీఎల్‌వోలుగా పనిచేస్తున్నామని, మూడున్నరేళ్ల నుంచి ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనం అందలేదని వాపోయారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఎప్పటికప్పుడు పక్కాగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు.

ఫార్మా మృతులకు కొవ్వొత్తులతో నివాళి


ఫార్మాలో మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మాలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు సంతాపంగా శుక్రవారం రాత్రి అచ్యుతాపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ ఈ ప్రమాదంలో 17 మంది మృతి చెందినా ఇంత వరకు యాజమాన్యాన్ని అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.సోమునాయుడు, రమణ, రామునాయుడు, నరసింహారావు, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ


పట్టణంలోని కొత్తపేటలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు


కొక్కిరాపల్లి గురుకులంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో,ఉపాధ్యాయ సిబ్బంది


యలమంచిలి జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు, విద్యార్థులు


కేజీబీవీలో మొక్కలు నాటుతున్న అధికారులు

యలమంచిలి రూరల్: వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం యలమంచిలి పట్టణం, మండలంలో పలు చోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు చేపట్టారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్యగుప్తా, బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని కొత్తపేటలో చెరువు పక్కన అధికారులు, విద్యార్థులతో కలిసి వారు మొక్కలు నాటారు. విద్యార్థులు నాటిన మొక్కల్ని కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దపు శ్రీను, దూది నర్సింహమూర్తి, పిల్లా త్రినాథరావు, కొలగాని నాయుడు, మోహన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

- స్థానిక అటవీ శాఖ ఆధ్వర్యంలో యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులంతా మొక్కల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలని యలమంచిలి అటవీ పరిధి అధికారి అనిల్‌కుమార్ సూచించారు. విద్యార్థులతో మొక్కల పెంపకంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్, చక్రదర్, అటవీ సెక్షన్ అధికారి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.
- కొక్కిరాపల్లి అంబేడ్కర్ గురుకులంలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా ఎంపీడీవో కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వక్తలు తమ ప్రసంగాల్లో విద్యార్థులకు సూచించారు. ఏవో ప్రసాద్, కొక్కిరాపల్లి గురుకులం ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం, సంగీతం ఉపాధ్యాయురాలు హరిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక కేజీబీవీలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఆవరణలో వేప, కానుగ, బాదం మొక్కలు నాటారు. ఎంఈవో కుంచం నరేష్, సర్పంచ్ నేతల రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సలీమా, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో భాగ్యవతి పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


కొండకర్ల చెరువులో గంబూషియా చేప పిల్లలు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది


శ్రీరాంపురంలో నీటి తొట్టెల్లో చేపలను వదులుతున్న వైద్యులు


ఉప్పరాపల్లి బావిలో గంబూషియా చేపలు విడుదల చేస్తున్న సిబ్బంది

మునగపాక: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మునగపాక, పాటిపల్లి చెరువులలో ఆమె గంబూషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విమలగిరి మాట్లాడుతూ గంబూషియా చేపలతో దోమల నివారణ సాధ్యమన్నారు. పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, సీహెచ్‌వో దేవకాంత, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు సంతోషి, దుర్గ, ఏఎన్ఎంలు దేవకి, రేవతి, సుజాత, హెల్త్ అసిస్టెంట్ విల్లూరి జగన్నాథరావు, జ్యోతిలాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

మునగపాక(అచ్యుతాపురం): ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని, తద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి వసంతకుమార్ చెప్పారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల చెరువులో శుక్రవారం గంబూషియా చేప పిల్లలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క గంబూషియా చేప రోజుకు 50 నుంచి 100 దోమల లార్వాలను ఆహారంగా తింటుందన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, వైద్య సిబ్బంది రమణ, నాగేశ్వరరావు, ముఖేష్, లక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

పాయకరావుపేట: దోమలు వ్యాప్తి చెందకుండా గంబూషియా చేపలను నీటి గుంటలు, డ్రైనేజీల్లోను విడిచిపెడుతున్నట్టు గంబూషియా చేపలు సబ్ యూనిట్ అధికారి పి.జె.ఆర్.పి.నాయుడు తెలిపారు. శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గంబూషియా చేపలను నిల్వ నీటి గుంటల్లో విడిచిపెట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తులసీ నవీన, ఎంపీఎల్ఆర్‌వో ఆర్‌జే బాలాజీసింగ్ పాల్గొన్నారు. పాయకరావుపేట పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారి పి.సుభాష్, ఈవో రమణ, నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొని గంబూషియా చేపలు విడిచిపెట్టారు.

ఎస్.రాయవరం: దోమల నివారణకు మండలంలో ఉప్పరాపల్లి, సర్వసిద్ధి, ఎస్.రాయవరం, తదితర గ్రామాల్లో బావులు, చెరువుల్లో గంబూషియా చేపలు విడుదల చేసినట్టు వైద్యాధికారి ఎస్.ఎస్.వి.శక్తిప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది టి.నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ ఎస్.ఎస్.వి.ప్రసాద్, హెల్త్ విజిటర్ వై.సూర్యకుమారి పాల్గొన్నారు.

మైహోంలో రక్తదాన శిబిరం


మైహోంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న ఉద్యోగులు

యలమంచిలి రూరల్: ములకలాపల్లి సమీప మైహోం ఇండస్ట్రీస్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటై 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని మైహోం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వీహెచ్.చౌదరి ప్రారంభించారు. అనంతరం పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్యుడు సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు పడనవసరం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైహోం గ్రూప్ సేఫ్టీ హెడ్ విజయ్ కుమార్, ఫ్యాక్టరీ జీఎం బి.రామస్వామి, సీనియర్ డీజీఎం ఎల్.శ్రీనివాసరావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

లక్కవరంలో పశు వైద్య శిబిరం

యలమంచిలి రూరల్: లక్కవరంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు ఉచిత గర్భకోశ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ బి.రామ్మోహన్ రావు, సహాయ సంచాలకుడు గంగాధర్, ఏటికొప్పాక పశువైద్యాధికారి డాక్టర్ దేవరాజు పశువులకు పరీక్షలు చేశారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పలు పశువులకు గర్భస్థ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.భానుబాబు, డాక్టర్ కె.ప్రత్యూష పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ


పందూరు పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోటవురట్ల: మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ సింగంపల్లి ఎరుకునాయుడు బోడపాలెం ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు, పెన్నులు అందజేశారు. పందూరు ఎంపీపీ స్కూల్‌లో సర్పంచ్ చీకట్ల జగదీష్, వైఎస్సార్ సీపీ నాయకులు టి.నారాయణరావు, చీకట్ల వెంకట్, సింగంపల్లి కిషోర్, అల్లు కిషోర్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.

దుర్భాషలాడిన వ్యాన్ యజమానిపై కేసు నమోదు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేటలో ఓ ఇంటి గేటుకు అడ్డంగా వ్యాన్ పార్క్ చేయడమే కాకుండా వృద్ధుడిని దుర్భాషలాడిన వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 26న రాత్రి 8.45 గంటల సమయంలో కొత్తపేట వీధిలో వృద్ధుడు పాండ్రంకి భాస్కరరావు నివాసముంటున్న ఇంటికెదురుగా వ్యాన్‌ను నిలిపి ఉంచాడు ఓ డ్రైవర్. రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, వెంటనే వ్యాన్‌ను పక్కకు తీయాలని భాస్కరరావు వ్యాన్‌పై ఉన్న ఫోన్ నంబరుకు కాల్ చేసి యజమాని వాడపల్లి రాజును కోరాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు.